# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- కూకట్‌పల్లి, వివేకానందనగర్ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వివేకానందనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



జవహర్ నగర్ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజులారెడ్డి

మియాపూర్/కొండాపూర్, అక్టోబర్ 1 : ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఆదివారం వివేకానందనగర్ డివిజన్‌లో రూ.3.46 కోట్లు, కూకట్‌పల్లి డివిజన్‌లో రూ. 1.5 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, యూజీడీ పనులకు కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, జూపల్లి సత్యనారాయణలతో కలిసి విప్ గాంధీ శంకుస్థాపన చేశారు. కూకట్‌పల్లి డివిజన్‌లో ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 9 వేల కోట్లతో సీసీ రోడ్లు, యూజీడీ, తాగునీరు, వరద కాలువలు, కమ్యూనిటీ హాళ్లు, నాలాల నిర్మాణం చేపట్టామన్నారు. నానాటికీ నియోజకవర్గం విస్తరిస్తూ కొత్త కాలనీల ఏర్పాటవుతున్నందున తదనుగుణంగా వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో వందలాది కిలోమీటర్ల అంతర్గత రహదారులతో మెరుగైన ప్రయాణ వసతి కల్పించామని, లింక్ రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, బీఆర్ఎస్ పార్టీ వివిధ డివిజన్ల నాయకులు, మహిళా ప్రతినిధులు, కాలనీ సంఘాల నేతలు, అధికారులు పాల్గొన్నారు.

**రూ. 25 లక్షలతో జవహర్ కాలనీ పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. ఆదివారం చందానగర్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీ పార్కులో రూ. 25 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన డివిజన్ కార్పొరేటర్ మంజులారఘునాథరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం విప్ గాంధీ మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధితో పరిసర కాలనీ వాసులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌తో పాటు ఓపెన్ ఎయిర్ వ్యాయామాలు చేసుకోవచ్చన్నారు. వృద్ధులు, పిల్లలు సేద తీరేందుకు ప్రశాంత వాతావరణం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్, నాయకులు, కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం




స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సర్కిల్ వైద్యాధికారి మమత, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



జవహర్ నవోదయ విద్యాలయంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

మియాపూర్, కొండాపూర్, అక్టోబరు 1 : వివేకానందనగర్ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సర్కిల్ వైద్యాధికారి మమత, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ నివాస, ఆవాస ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తడి,పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని విప్ గాంధీ సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే అంటువ్యాధులు దరి చేరవని, ఇంటి చుట్టూ ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పరచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

**గచ్చిబౌలిలో స్వచ్ఛతా హీ సేవా..**

ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉంటామని నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ ఉపసంచాలకులు తలపల గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 'స్వచ్ఛతా హీ సేవా అభియాన్ –2023'లో ఆయన పాల్గొన్నారు. విద్యాలయ అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో కలిసి కార్యాలయ ప్రాంగణం, పరిసరాలు, వీధులు, నవోదయ విద్యాలయ క్యాంపస్,క్రీడా ప్రాంగ ణం, భోజనాలయం, వసతి గృహాలు, తరగతి గదులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ –20 ఉపసంచాలకులు రజనీకాంత్‌రెడ్డి, నవోదయ సహాయ కమీషనర్లు కేవీ సుబ్బారెడ్డి, అభిజిత్ రంజితబెహ్రా, విజయ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**లక్ష్మీ విహార్ ఫేజ్–2లో..**

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని లక్ష్మీ విహార్ ఫేజ్ –2లో కాలనీ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు చెత్త చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు రవీంద్ర ప్రసాద్ దూబే మాట్లాడుతూ.. ప్రతి నెలలో ఒకసారి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని కాలనీ పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీ సభ్యులు నర్సింహారావు, సీతారామరాజు, మాధవికుమార్, రామసుబ్బారెడ్డి, భాస్కరరావు, రామామూర్తి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న ప్రభుత్వ విప్ గాంధీ

మియాపూర్ , అక్టోబరు 1 : నిరుపేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తున్నదని ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 28 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 24.57 లక్షల చెక్కులను ఆదివారం తన నివాసంలో ప్రభుత్వ విప్ గాంధీ లబ్ధిదారులకు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ నిధులతో పేదలు కార్పొరేట్ దవాఖానల్లో చికిత్స చేయించుకుంటున్నారన్నారు. పేదలకు అనేక విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారావుతోపాటు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, అక్టోబర్ 1 : మాదాపూర్ శిల్పారామంలో కొనసాగుతున్న గుజరాత్ ఉత్సవ్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆదివారం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గుజరాత్‌కు చెందిన జానపద నృత్యాలు కాచిగోడి, పప్పెట్ షో, రాస్ గర్భ నృత్యాలను కళాకారులు ప్రదర్శించి ఆహుతులను అలరించారు. అనంతరం కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి శిష్య బృందం కూచిపూడి నృత్య రీతులతో ఆకట్టుకున్నారు. వారాంతపు సెలవు కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో విచ్చేసి మేళాలో ఉంచిన గుజరాత్ చేనేత హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ముంపు లేకుండా వరద కాలువల నిర్మాణం



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్ , అక్టోబరు 1: వరద ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా వరద కాలువలను నిర్మిస్తున్నట్లు మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఏఎస్ రాజు నగర్, మహోదయ ఎన్‌క్లేవ్‌లో చేపట్టనున్న వరద కాలువ ప్రాంతాలను ఆదివారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు, వరదలతో ముంపు సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సింహభాగం సమస్య తీరినట్లేనని, అవసరమైన ప్రాంతాల్లో వరద కాలువలను విస్తరిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో రవీంద్రకుమార్, చుక్కారావు, సూర్యనారాయణ, సతీశ్, భూపతి, శశిధర్ పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో 25శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కొండాపూర్, అక్టోబర్ 1 : పాండిచ్చేరి యూనివర్సిటీ తరహాలో తెలంగాణ విద్యార్థులకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, కార్యదర్శి అరుణ్ కేతన్‌లు ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాశారు. సీయూఈటీ ప్రభావం వల్ల తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, దాంతో ఇక్కడి యువత సెంట్రల్ యూనివర్సిటీలో చదివే అవకాశాలు కోల్పోతున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ట్రైబల్ యూనివర్సిటీ ఐఐఎం, ఐఐఎస్ఈఆర్‌లను తెలంగాణలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## ఆత్మరక్షణ కోసం తైక్వాండోను నేర్చుకోవాలి : ఎంపీపీ

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 4:** తైక్వాండోను అభ్యసించడం ద్వారా ఆత్మరక్షణతో పాటు స్వీయ క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆలోచన విధానాన్ని పెంపొందిస్తుందని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి తెలిపారు. మండల పరిధి ఎదులాబాద్ జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం జరిగిన టైక్వాండో క్రీడల్లో క్రీడాకారులు సాధించిన కలర్ బెల్ట్‌లను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, ఉప సర్పంచ్ లింగేశ్వర్ రావు, నాయకులు విశ్వనాథం, హనుమంతు, నాగరాజు, అర్జున్, నరేశ్ పాల్గొన్నారు.

## గణేశ్ లడ్డూ వేలం

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపినగర్‌లో భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను శనివారం రాత్రి నిర్వహించిన వేలంలో రూ. 5,11,000లకు చింతకింది పవన్ కుమార్ కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు.

– కొండాపూర్, అక్టోబర్ 1

